క్లుప్తంగా

అప్రమత్తతతో అగ్నిప్రమాదాల నివారణ



పొదలకూరు : అప్రమత్తతతో అగ్నిప్రమాదాలను నివారించవచ్చని పొదలకూరు అగ్నిమాపక అధికారి వరకుమార్ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆచారి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న మహిళలకు అగ్నిప్రమాదాలపై ఆదివారం అవగాహన కల్పించారు. వంటగ్యాస్ కారణంగా సంభవించే అగ్నిప్రమాదాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలను మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. వంట చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్యాస్ లీకై మంటలు వ్యాపించిన వెంటనే తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. అనంతరం కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికుడికి ఆర్థిక సాయం



పొదలకూరు : మండలంలోని బిరదవోలుకు చెందిన కల్లుగీత కార్మికుడు కైతేపల్లి శ్రీనివాసులుకు జిల్లా గౌడ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు తోట ప్రభాకర్‌గౌడ్ ఆదివారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కల్లుగీస్తూ చెట్టుపై నుంచి పడి గాయపడిన శ్రీనివాసులకు జిల్లా గౌడ్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత కోసూరు గోవిందయ్య ఆశయ సాధన మేరకు నగదు సాయం అందజేసినట్లు ఆయన తెలిపారు. బిరదవోలు ఎంపీటీసీ రావుల దశరథరామయ్యగౌడ్, గౌడ్ సేవా సమితి బాధ్యులు తాళ్ల రాజాగౌడ్, రామకృష్ణగౌడ్, శ్రీనివాసులుగౌడ్, ఇంద్రసేన్‌గౌడ్, అన్నం సుబ్బారావుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద పంపిణీకి నగదు విరాళం



ఇందుకూరుపేట: ప్రముఖ పుణ్యక్షేత్రం గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి ఆలయంలో అన్నప్రసాద వితరణకు నెల్లూరు చెందిన గాదం విశ్వనాథ్, అమ్మణ్ణమ్మ దంపతుల కుమారుడు, కోడలు అమరనాథ్, తులసి రూ.25 వేలు నగదు విరాళం ప్రకటించారు. ఆదివారం ఆలయ ఆవరణలో ఈఓ బండి శాంతయ్యకు నగదు అందజేరు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ కొండూరు కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా వసంతోత్సవం



మనుబోలు: మండలంలోని సంగమేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వసంతోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఈ నెల 14న సంగమేశ్వరాలయంలో సంగమేశ్వరస్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించిన విషయం తెలిసిందే. మనుబోలులోని శివాలయానికి చేరుకున్న ఆదిదంపతులకు అర్చకులు సాయిశర్మ వేదమంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివ పార్వతుల ఉత్సవమూర్తులను ఎడ్ల బండిపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవదేవేరులపై భక్తులు వసంతం చల్లారు. చిన్నారులు, యువతీ యువకులు ఒకరిపై ఒకరు వసంతం చల్లుకుని కేరింతలు కొట్టారు. శనివారం రాత్రి పార్వేట కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

అగ్నిప్రమాద నివారణ చర్యలపై అవగాహన అవసరం



సిలిండర్‌లో మంటలను ఆర్పే అంశంపై అవగాహన

నెల్లూరు(క్రైమ్): అగ్ని ప్రమాద నివారణ చర్యలపై ప్రతి ఒక్కరూ అవగాహనను పెంపొందించుకోవాలని జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గ్యాస్ సిలిండర్ల కారణంగా ప్రమాదాలు సంభవించిన సమయంలో తీవ్రతను ఎలా నియంత్రించాలి.. మంటలను ఎలా ఆర్పాలి.. తదితర అంశాలపై మహిళలకు వివరించి వారితో డెమో చేయించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా రంగనాయకులపేటలోని శ్రీకళ ఎమరాల్డ్ అపార్ట్‌మెంట్స్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్యాస్ లీకై అగ్నిప్రమాదం సంభవించే అవకాశముంటే రెగ్యులేటర్ వాల్వ్‌ను ఆపాలని సూచించారు. అపార్ట్‌మెంట్లలో అగ్నిమాపక పరికరాలను విధిగా ఏర్పాటు చేసుకోవడంతో పాటు వాటి వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. అగ్నిప్రమాదం సంభవిస్తే గందరగోళం సృష్టించకూడదని, సమయపాలన పాటిస్తూ తమను తాము రక్షించుకుంటూ ఇతరులను రక్షించేందుకు యత్నించాలని చెప్పారు. అగ్నిప్రమాదాలు సంభవించిన వెంటనే అగ్నిమాపక శాఖ కార్యాలయం లేదా 101కు సమాచారం అందించాలని కోరారు. అపార్ట్‌మెంట్లు, షాపింగ్ మాల్స్, వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలు, హాస్పిటళ్లు, విద్యాసంస్థలు, తదితరాల్లో అత్యవసర సర్వీసుల ఫోన్ నంబర్లను నోటీస్ బోర్డుల్లో ఉంచాలని సూచించారు. నెల్లూరు అగ్నిమాపక కేంద్ర అధికారి జాషువా, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ



ఆమంచర్లలో..



పుత్తా ఎస్టేట్స్‌లో..

నెల్లూరు రూరల్: ఆమంచర్లలోని సేవాజ్యోతి కాలనీలో గల 120 మంది కుష్టు వ్యాధిగ్రస్తుల కుటుంబాలకు నిత్యావసర సరకులు, మెడికల్ కిట్లను ఎల్ఐసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘ నెల్లూరు డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎల్ఐసీ నెల్లూరు డివిజన్ ఎస్డీఎం రవికుమార్ మాట్లాడారు. ఎల్ఐసీని ప్రతి ఒక్కరూ ఆదరించాలని కోరారు. ఎల్ఐసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, చెన్నయ్య, సీనియర్ బ్రాంచ్ మేనేజర్లు విశ్వేశ్వర్, జనార్దన్, సంఘ కార్యవర్గ సభ్యులు విజయానంద్, ఆదినారాయణ, రామారావు, బాలకృష్ణ, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వేదాయపాళెం): పాత మున్సిపల్ కార్యాలయ సమీపంలోని పుత్తా ఎస్టేట్స్ వద్ద 250 మంది పేదలకు బియ్యం, నిత్యావసర సరుకులను ప్యూర్ స్మైల్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షురాలు పర్వీన్, సభ్యులు షౌకత్ హుస్సేన్, వసీం అక్రమ్, నళిని, హేమ, తదితరులు పాల్గొన్నారు.

కుల వ్యవస్థలో అసమానతలు తొలగిపోవాలి



చిత్రపటాన్ని అందజేస్తున్న కమలానందభారతి

నెల్లూరు(బృందావనం): కుల వ్యవస్థలో అసమానతలు తొలగిపోవాలని హిందూ దేవాలయ ప్రతిష్ఠాపన పీఠాధిపతి, గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతి కమలానందభారతి పేర్కొన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న దంపతులతో ఇష్టాగోష్టి సమావేశాన్ని కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలోని అతిథి గ్రాండ్‌లో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాచీన కాలంలో వర్ణాంతర వివాహాలు, నేటి కులాంతర వివాహాలు ధర్మ సమ్మతమేనని చెప్పారు. సమాజంలో కొందరు తమ కులవృత్తులపై అనుసరిస్తున్న విధానాలతో పలువురు ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన దంపతులకు అరుంధతి, వశిష్ఠుల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు. సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ శ్యామ్‌ప్రసాద్, శ్రీధర్, కేశవులు, జయప్రద, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

శృంగా డెవలపర్స్ బ్రోచర్ల ఆవిష్కరణ



నెల్లూరు(వేదాయపాళెం): శృంగా బిల్డర్స్ అండ్ డెవలపర్స్ ఆధ్వర్యంలో వెంచర్లకు సంబంధించిన బ్రోచర్లను డీఆర్ ఉత్తమ హోటల్లో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐకాన్ మిస్ ఇండియా భావన మాట్లాడారు. బెంగళూరు నగరానికి అత్యంత చేరువలో అందరికీ అందుబాటులో ప్లాట్లు ఉన్నాయన్నారు. భవిష్యత్తులో నెల్లూరులోనూ వెంచర్‌ను ఏర్పాటు చేయనున్నారని పేర్కొన్నారు. డెవలపర్స్ ఎండీ గంగాధర్‌రెడ్డి, శ్రీకాంత్, కోటేశ్వరరావు, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

మసీదులో ప్రత్యేక ప్రార్థనలు



నెల్లూరు రూరల్: నారాయణరెడ్డిపేటలోని మసీదులో ఇఫ్తార్ విందును ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు పరమేశ్వరరెడ్డి, కమలాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు నాగరాజు, రామ్మోహన్, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎమ్మెల్సీ



నెల్లూరు(సెంట్రల్): ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డిని నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా సురేష్



నెల్లూరు(బారకాసు): బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా సురేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు నియామక పత్రాన్ని నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్ అందజేశారు.

విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణకు వినతి

నెల్లూరు (టౌన్): నగరంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరపాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. విద్యార్థి మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

నెల్లూరు (టౌన్): పాలిసెట్ రాయనున్న విద్యార్థుల కోసం వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణను సోమవారం నుంచి నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ సుధాకర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిక్షణను నిర్వహించనున్నామని చెప్పారు. వివరాలకు 91820 63830, 94923 37539 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

భగవద్రామానుజాచార్యులు అవతార మహోత్సవాలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో భగవద్రామానుజాచార్యులు అవతార మహోత్సవాలకు ఆదివారం శ్రీకారం చుట్టారు. తిరుమంజనం, పేట ఉత్సవం, సేవా కాలం, శాత్తుమొరైను నిర్వహించారు. ఉభయకర్తగా ఆదెమ్మ వ్యవహరించారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



నెల్లూరు(బారకాసు): జిల్లాకు చెందిన పెంచలచైతన్య సైకిల్ యాత్ర చేపట్టి 111 రోజులు పూర్తయిన సందర్భంగా ఆత్మకూరు బస్టాండ్ వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని చైతన్య టీమ్ సభ్యులు ఆదివారం ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఏడు వేల కిలో మీటర్ల యాత్రను పూర్తి చేశారని వారు చెప్పారు. చైతన్య తల్లిదండ్రులు నరసింహులు, అంజనీదేవి, సభ్యులు సూర్య, ఇమ్రాన్, వెంకీ, తదితరులు పాల్గొన్నారు.

సాయిదర్బార్‌లో వైద్య శిబిరం



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ సమీపంలోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో ఉచిత వైద్య శిబిరాన్ని సుధీర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. వైద్యులు రామ్మోహన్, వాణి, ధీరజ్, నాగమాణిక్యం, మొహసిన్‌ఖాన్ దాదాపు 300 మందికిపైగా రోగులకు ఈసీజీ, బీపీ, షుగర్, తదితర పరీక్షలను జరిపారు. అనంతరం వీరికి మందులను అందజేశారు. మందిర మేనేజింగ్ ట్రస్టీ, చైర్మన్ మధుసాయి, రామసుబ్బయ్య, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

'వికాస్ ఆరోగ్య దీపిక'కు విరాళం



నెల్లూరు(బృందావనం): వికాస్ ఆరోగ్య దీపిక పథకానికి రూ.10 వేల విరాళాన్ని అనిరుధ్ అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. బాలాజీనగర్‌లోని వికాస్ ప్రజాహిత సేవా సమితి కార్యాలయంలో ఈ మొత్తాన్ని ఆదివారం ఆయన అందజేశారని చెప్పారు. డివిజన్ పరిధిలోని పేదలకు రూ.50 వేల విలువజేసే మందులను ప్రతి నెలా అందజేస్తున్నామని తెలిపారు.

వాకర్స్‌కు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న భాస్కర్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఎముకలు, కీళ్లు, నరాలపై వాకర్స్‌కు అవగాహన సదస్సును ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం నిర్వహించారు. ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్, డాక్టర్ భాస్కర్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు. అనంతరం వాకర్స్‌కు పౌష్టికాహారాన్ని సదానందరెడ్డి, వెంకటరమణ అందజేశారు. రీజినల్ కో ఆర్డినేటర్ రాఘవరెడ్డి, 2022 వాకర్స్ ఇంటర్నేషనల్ ట్రెజరర్ బలరామయ్యనాయుడు, ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హరిబాబు, రామ్మోహన్‌రెడ్డి, కోశాధికారి నసీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



నెల్లూరు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీపీజేఏ) క్యాలెండర్లను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. మాల్యాద్రి, గణేష్, వెంకట్, జకీర్, విజయకృష్ణ, దేవా, తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి కృష్ణమూర్తి



నెల్లూరు(బృందావనం): బహుముఖ ప్రజ్ఞాశాలిగా నేలనూతల కృష్ణమూర్తి గడించిన కీర్తి ప్రతిష్టలు అనన్యసామాన్యమైనవని నెల్లూరు రామకృష్ణ సేవా సమితి ఉపాధ్యక్షుడు సాయికుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కృష్ణమూర్తి జయంతిని పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పద్యకళాపరిషత్ అధ్యక్షుడు రామచంద్రప్రసాద్, ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు ప్రాంతీయ సమన్వయకర్త బలరామయ్యనాయుడు, రమణయ్య, ప్రముఖ సాహితీవేత్త పురుషోత్తం, వీఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



కోవూరు(విడవలూరు): విడవలూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎయిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. న్యూరో సర్జన్ హేమాలతారెడ్డి రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పూండ్ల అచ్యుతరెడ్డి, ఎంపీపీ భవానమ్మ, సర్పంచ్ ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి పాశం శ్రీహరిరెడ్డి, వేనాటి ప్రసాద్ పాల్గొన్నారు.

రౌడీషీటర్ అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): వ్యక్తిని కత్తితో బెదిరించి నగదును దోచుకెళ్లిన ఘటనలో రౌడీషీటర్‌ను సంతపేట పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. గోమతినగర్‌కు చెందిన విజయ్‌కుమార్ ఏసీ సెంటర్‌లోని పీకాక్ రెస్టారెంట్ అండ్ బార్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. బార్ వద్ద కపాడిపాళెం పెద్దబావి సెంటర్‌కు చెందిన రౌడీషీటర్ సాగర్ అతడ్ని కత్తితో చంపుతానని బెదిరించి రూ.వెయ్యిని శనివారం దోచుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. కనకమహల్ సెంటర్ వద్ద సాగర్‌ను అరెస్ట్ చేశామని ఇన్‌స్పెక్టర్ కల్యాణ్‌రాజు తెలిపారు.

అర్హులకు సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాలపై ప్రచారం చేస్తున్న మహేష్



28వ డివిజన్లో..



వెంకటేశ్వరపురంలో..



54వ డివిజన్లో..

నెల్లూరు(సెంట్రల్): అర్హులకు సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని 46వ డివిజన్ కార్పొరేటర్ వేలూరు మహేష్ పేర్కొన్నారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా డివిజన్లోని ఏటీ అగ్రహారం, బృందావనం, నక్కలోళ్ల సెంటర్, తదితర ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. అనంతరం సంక్షేమ పథకాలపై కరపత్రాలను అందజేశారు. ఆయా గృహాలకు స్టిక్కర్లను అతికించారు.

- జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని రూరల్ పరిధిలోని 28వ డివిజన్లో నిర్వహించారు. డివిజన్లోని ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. మాజీ కార్పొరేటర్ మదన్‌మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53, 54వ డివిజన్ల పరిధిలో గల గాంధీ గిరిజన కాలనీ, వెంకటేశ్వరపురం, ఇస్లాంపేట ప్రాంతాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, నేతలు ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను పార్టీ నేతలు, కార్యకర్తలు అతికించారు. కార్పొరేటర్లు సుజాత, సఫియా, కో ఆప్షన్ సభ్యుడు జమీర్ అహ్మద్, సచివాలయ కన్వీనర్లు వెంకటరమణ, శ్రీనివాసులురెడ్డి, నేతలు ముజీర్, నాగరాజు, సహదేవరెడ్డి, వెంగళ్‌రెడ్డి, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.